ఇది గమనించిన ఓ లెక్చరర్ వాళ్ళ దగ్గరకి వచ్చి ఓ చిన్న కేరి బేగ్ ఇచ్చి చెప్పాడు.

"దీన్ని మీ దగ్గర జాగ్రత్తగా వుంచి సాయంత్రం నేను ఇంటికి వెళ్ళేప్పుడు ఇవ్వండి."

ఆ సంచీలోంచి దుర్వాసన వస్తూండటంతో వాళ్ళిద్దరూ ముక్కులు మూసుకున్నారు.

"ఇందులో ఏం వుంది సార్?" ప్రశ్నించాడు ఒకడు.

"లాండ్రికి తీసుకెళ్దామని తెచ్చాను. నేను ఉపయోగించి విడిచిన సాక్స్." జవాబు చెప్పాడు ఆ లెక్చరర్.

"సాయంత్రం దాకా ఈ వాసనని భరించే శక్తి మాకు లేదు సార్." నిర్మొహమాటంగా చెప్పారు వాళ్ళు దాన్ని తిరిగి ఇచ్చేస్తూ.

"ఇంతసేపు మీరు చెడు మాటలని ఆస్వాదించ గలగడం చూసాను. కుళ్ళిన చెట్టునించి దుర్వాసన వచ్చినట్లు మీ నించి కూడా చెడు వాసన వేస్తున్నప్పుడు ఈ చెడు వాసనని ఎందుకు భరించలేకపోతున్నారు?" నవ్వుతూ ప్రశ్నించాడు లెక్చరర్.

వాళ్ళకి తమ తప్పిదం తెలిసివచ్చి సిగ్గుతో తలలు వంచుకున్నారు.

"గంధం చెట్టులా మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోండి. అప్పుడు చెడు వాసనలని ఆస్వాదించేవారు మాత్రమే కాక అంతా మీ సాన్నిహిత్యాన్ని కోరు కుంటారు." వాళ్ళకి సలహా ఇచ్చాడు ఆయన.

## 31. వినాశిని

అరేబియాలోని ఓ ప్రాంతంలో ఓ పెద్ద ఎడారి ఉంది. ఆ ఎడారిలో ఓ చోట నించి మరో చోటికి వెళ్ళే దారిలో ఓ పెద్ద ఒయాసిస్ ఉంది. చీకటి పడుతూండగా ప్రయాణీకులు ఆ ఒయాసిస్ దగ్గర విడిది చేసి, రాత్రి అక్కడ గడిపి మర్నాడు నీటిని తోలు సంచీల్లో నింపుకోడానికి ఆ నీటి ఊట దగ్గరకి వెళ్తూంటారు. కాని నీటిని నింపుకోడానికి వెళ్ళేసరికి వాళ్ళకి ఒయాసిస్ పక్కనే

పడి ఉన్న ధగ ధగ మెరిసే వజ్రాలు కనిపిస్తాయి. వారు వెంటనే తమ జేబుల నిండా ఆ వజ్రాలని నింపుకుంటారు. ఆశ చావక నీటిని నింపాల్సిన తోలు సంచీల్లో కూడా వజ్రాలని ఆనందంగా నింపుకుంటారు. ఐతే ఆ ఆనందం వారికి ఎక్కువ సేపు ఉండదు.

ప్రయాణం కొనసాగించాక వారికి దాహం వేస్తుంది. నీటి సంచీల్లోని వజ్రాలు దాహాన్ని తీర్చలేవు కదా? త్వరలోనే వారి దేహాలు రాలిపోతాయి. వారు కూడా చుట్టు పక్కల పడి ఉన్న మిగిలిన అస్థిపంజరాల్లో కలిసిపోతారు. వజ్రాలకి బదులు సంచీల్లో నీళ్ళని తీసుకెళ్తే జీవించి ఉండటమే కాక, జేబుల్లోని వజ్రాలని అమ్ముకుని సుఖంగా జీవించ గలిగేవారు.

ఆశ! ధనాశ! మనిషిని ఎన్నో యుగాలుగా ఆధ్యాత్మికంగా నాశనం చేస్తున్న వినాశిని ధనమే.

## 32. ఇంకా ఉదయం కాలేదు

తన పదహారో ఏటే ఆధ్యాత్మిక తపనతో స్వంత ఇంటిని, ఊరుని వదిలిపెట్టి ఒకడు హిమాలయాలకి వెళ్ళిపోయాడు. ఋషికేశ్‌లో ఓ గురువు దగ్గర మంత్ర దీక్ష తీసుకుని, ఆయన సూచన ప్రకారం చలికాలం ఆరు నెలలు ఉత్తర కాశీలో, వేసవి వర్షా కాలాలు ఆరు నెలలు గంగోత్రిలో వుంటూ ఆధ్యాత్మిక సాధనలని చేయసాగాడు.

నియమ నిష్టలని పాటిస్తూ, నిత్యం ఉదయం నాలుగు నించి రాత్రి తొమ్మిది దాకా అతను పూజ, జప, ధ్యానాలని చక్కగా అనుష్టించసాగాడు. తనకి అరవై ఏళ్ళు వచ్చేదాకా క్రమం తప్పకుండా అతను ఆ ప్రకారం జీవించాడు. చాలాకాలంగా నిష్టగా అనుష్టానం సాగిస్తున్నా తనకి ఎలాంటి భగవదానుభూతి కలగక పోవడంతో అతనిలో అసంతృప్తి బాగా పేరుకోసాగింది. తను చేసిందానికి ప్రతిఫలం లభించలేదన్న బాధతో అతను ఆధ్యాత్మిక జీవితాన్ని వదిలేసి, తిరిగి లౌకిక జీవితంలోకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. దాంతో కాషాయాలని వదిలేసి, హిమాలయాలని వదిలి తన స్వగ్రామం వైపు బయలుదేరాడు.